కొత్త జీవితం

అది ఫాక్టరీ కూలీలకోసం పెట్టిన హోటలు. అక్కడ అరణాకు "చా" దొరుకుతుంది అణా పెడితే కాసిని "భజ్యా" తిని "చా" తాగవచ్చు. సాహసించి ఇంకో అరణా ఖర్చుపెట్టదలచినవాడు "పావ్-ఉసల్"తో పొట్ట నింపుకుని, "చా" తాగిపోవచ్చు. "భజ్యా" అంటే శనగ పిండితో చేసిన పకోడీలు. "పావ్" అంటే నాలుగౌన్సుల రొట్టె. "ఉసల్" అంటే శనగలుగాని, అల్చందలుగాని వేసి నీటితో మరగబెట్టిన కూర. అందులో రొట్టె ముంచుకు తినవచ్చు.

ఉదయం ఏడున్నరకల్లా ఫాక్ట్రీపనివాళ్లు ఒక్కొక్కరే వచ్చి కూచుని హిందీలోనూ, మహారాష్ట్రంలోనూ తమకు కావలసిన ఆహారపదార్థాలు అతి తొందరగా ఆర్డరివ్వసాగారు. పదార్థాలందించే వాడేకాక, గల్లాదగ్గర కూర్చున్న వాడుకూడా, "ఏక్ గ్లాస్ పానీదే' ఏక్ లెమన్ దో!" అని కేకలు పెడుతూ, తినేవాళ్ళ అవసరాలు కనుక్కుంటున్నాడు.

ఈ హోటల్లోకి ఒక కుర్రాడు వచ్చాడు. అందరి

కళ్ళూ వాడు తొడుక్కున్న కొత్తచొక్కామీదా, కొత్త ధోవతిమీదా పడ్డాయి. కాని వాడి పల్లెటూరి మొహం తెలిసిపోతూనే ఉంది. కుర్రాణ్ణి ఒక గుండ్రని బల్లదగ్గర కూర్చోబెట్టి వస్తువులందించేవాడు, "కాయ్ పాహిజే మలా?" అని అడిగాడు.

కుర్రాడికి ప్రశ్న అర్థమయిందిగాని వాడు వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు. వాడి మొహానికి అడుగున్నర దూరంలో పెద్ద గాజుజాడీనిండా తెల్లటి మజ్జిగపోసి పెట్టివుంది. బల్లమీద పరచిన చలవరాతి పలకలూ, నేలమీద పరచిన నున్నటి కృత్రిమ చలవరాతి పలకలూ వాడికి అత్యాశ్చర్యం కలిగించాయి. ఈ హోటలుకు జమీందార్లు కూడా వస్తారని వాడికి దృఢవిశ్వాసం కలిగింది. బల్లలదగ్గర కూర్చున్న వాళ్ళల్లో జమీందార్లెవరన్నా వున్నారేమో చూతామంటే మజ్జిగ జాడీమూలంగా సాధ్యపడలేదు.

"ఏం కావాలి?" అని మళ్ళీ అడిగాడు వస్తువులందించేవాడు.

"ఏమున్నయ్?" అన్నాడు కుర్రాడు. హోటలువాడు అన్నీ ఏకరువుపెట్టాడు. "పూరీ, శిరా, బటాటా, పాప్, ఉసల్, భజ్యా, చా, లెమన్, తాక్, షర్బత్...."

కుర్రాడు జాగ్రత్తగలవాడు. అన్నిటి ధరలూ కనుక్కొని రెండణాలన్నర దాటకుండా ఆర్డరిచ్చాడు.

హోటలునుంచి ఫాక్టరీకి ఎంతో దూరంలేదు. కొండపక్కగా వెళ్ళే అందమైన రోడ్డు నేరుగా ఫాక్టరీల దగ్గరికి తీసుకుపోతుంది. రోడ్డుపక్క వరసగా ఇరవై ఇళ్ళున్నాయి.

కొత్తగా కట్టినవి, చాలా అందమైనవి. వాటినిదాటి ఒక ఫర్లాంగు పోతే రెండు ఫాక్టరీలు ఒకదాన్నానుకుని మరొకటి వున్నాయి. ఒక అరఫర్లాంగు అవతల మూడో ఫ్యాక్టరీ వుంది. ఆ రోడ్డువెంబడి వచ్చాడు కుర్రాడు. వాడి కేదన్నా కూలిపని కావాలి.

మొదటి ఫ్యాక్టరీ నిర్జీవంగా కనిపించింది. రెండో ఫ్యాక్టరీ గేటుకెదురుగా రోడ్డు ఆవలివేపున నలుగురైదుగురు మనుషులు నిలబడి వున్నారు. వాళ్లూ పనికోసమే నిలబడి వున్నారని మన కుర్రాడికి తెలీదు. వాడు గేటుదగ్గర నిలబడి వున్న పఠానువాణ్ణి గమనించకుండా గేటుదగ్గరకి పోయి లోపలికి తొంగిచూశాడు. లోపల చాలా అందంగావున్నది. ఒక పక్కగా చిన్న కంచెమీద అందమైన లత ఒకటి పాకుతున్నది. దాని వెనక కొన్ని తోట్ల మొక్కలు చక్కగా పెట్టారు. ఫ్యాక్టరీ చాలా లోపలిగా వున్నది.

"పనిచేస్తే ఇటువంటి ఫాక్టరీలో పనిచెయ్యాలి" అనుకున్నాడు వాడు. పెట్టి పుట్టిన పనివాళ్ళు అటువంటిచోట పనికి కుదురుతా రనుకున్నాడు.

ఇంతలో – పఠాన్ గొంతు వినిపించింది.

"ఏయ్, ఏంకావాలి ?"

కుర్రాడికి హిందీ ఏమీ రాదు. కాని ప్రశ్న అర్థమయింది.

"పని" అన్నాడు వాడు.

"పోయి వాళ్ళదగ్గర నిలబడు... అదుగో యజమాని కారు. వెళ్ళు, వెళ్ళు, వెళ్ళు."

కంగారుతో కుర్రాడు రోడ్డుదాటి అవతలపడ్డాడు. వాడవతలికి వెళ్ళిన తక్షణంలోనే నల్లని కారొకటి అతి వేగంగా వచ్చి గేటులోకి తిరిగి లోపలికి వెళ్ళిపోయింది.

ఆ కారులోవున్న "మాలిక్" తనను గేటుదగ్గరచూసి కోపం తెచ్చుకున్నారేమో. తనకు పని యివ్వడేమోనని కుర్రాడికి బాధ కలిగింది. ఆ నల్లకారుకింద పడ్డా వాడికంత బాధ కలిగివుండదు.

2

ఫాక్టరీలముందు నిత్యమూ పనికోసం నుంచునే వాళ్ళను చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఆ ఫాక్టరీలలో ఏం చేస్తారో వారికి అవసరంలేదు. అది వనస్పతి ఫాక్టరీగానీ, లోహపు ఫాక్టరీగానీ, బట్టల మిల్లుకానీ వాళ్ళకు ఒకటే. చదువు వెంటపెట్టుకు పొయ్యేవాడికి ఉద్యోగం దొరకదగిన స్థలాలూ, దొరకదగని స్థలాలు అంటూ వుంటాయి. వాడు తనవెంట ఏదో తెచ్చుకుంటాడు. పారిశ్రామిక కూలీ తన కండలూ, ఎముకలూ తప్ప యింకేమీ తీసుకురాడు. గొట్టంలోంచి పొగనువచ్చే ఏచోటైనా వాడికి పోదగిన చోటే. ఏ చోటు అచ్చివచ్చేదీ, ఏది అచ్చిరానిదీ దైవాధీనం. ఒక ఫాక్టరీలో నాలుగు రోజులే వుండవచ్చు. మరో ఫాక్టరీలో నాలుగు నెల లుండవచ్చు. కాని కాలక్రమాన ఏదీ అచ్చిరాని చోటే. ఎందుచేతనంటే నాలుగేళ్ళు ఏ ఫాక్టరీలోనూ వుండడు. ఆ తరువాత మళ్ళీ జీవితం ఎప్పటి

చోటికి రావటమంటే పనివాడు తన కండలన్నీ వున్నవి వున్నట్టు వెనక్కి తెచ్చుకుంటాడనికాదు. అది ఎన్నటికీ జరగదు. అంతో యింతో రక్తమూ, కండలూ ఫాక్టరీకి ముట్టవలసిందే. ఫాక్టరీలనుంచి బయటికివచ్చే సమయానికి పొరపాటున నాలుగు డబ్బులు జేబులో మిగిలినా అవి పూర్తిగా అయిపోతేగాని మళ్లీ యింకోచోట పని కుదరదు. ఒక్కొక్కసారి డబ్బు లయిపోయినాక కూడా చాలాకాలం పని కుదరదు. ఇది కూలివాళ్ళకు అమ్మవారి శాపం. సుల భంగా పని దొరికే యుద్ధకాలంలోనే ఈ విధంగా వుంటే యితర సమయాల సంగతి వేరే చెప్పాలా ?

ఆ ఫాక్టరీ బయట పనికోసం నిలబడ్డవారిలో ఒకరిద్దరు చాలారోజులనుంచీ పని దొరకనివా రున్నారు. ఫాక్టరీ ప్రారంభమైన అరగంటలోగా పని దొరికేదీ లేనిదీ తెలిసిపో తుంది. ఆ తరవాత యింకోచోటికి వెళ్ళి లాభంవుండదు. అంతా లాటరీ.

ఈ లాటరీలో మన కుర్రాడి అదృష్టం బాగున్నది. యజమాని కారు లోపలికి వెళ్ళిన కొద్దిసేపట్లో లోపలినుంచి ఎవరో వచ్చి నిలబడి వున్నవాళ్ళకేసి ఒక్కసారి చూసి "తుమ్ ఆవ్, తుమ్ ఆవ్" అని మన కుర్రవాణ్ణి, మరొక యువకుణ్ణీ లోపలికి పిలుచుకు వెళ్లాడు. ఇది బొత్తిగా లాటరీ అనటానికి కూడా వీలులేదు. ఇది ఫాక్టరీ స్వయంవరం ఇందులో కండపుష్టీ,యువ్వనమూ చప్పున ఆకర్షిస్తాయి. లోప లికి పోయిన తరవాత ఆ మనిషి మన కుర్రవాడివంక

తిరిగి చాలా తొందర పనిమీదవున్న వాడల్లే మాట్లాడుతూ, "నీ పేరేమిటి?" అన్నాడు.

"విఠల్ పాండురంగ్."

"ఎప్పుడన్నా ఫ్యాక్టరీ పనిచేశా?"

"లేదు."

"రోజుకు మూడు పావలాలు మజూరీ, మూడు పావలాలు మాంగాయీ. ఈ ఖాతాలో పనిచెయ్యి."

తనకు నిజంగా యెంతో గొప్ప గౌరవం జరిగినట్లు భావించుకున్నాడు విఠల్. రోజుకు రూపాయిన్నర చొప్పున నెలకు? కనీసం 25 రోజులు పనిచేసినా ముప్పైఏడున్నర అయింది! ఏడాదికి? 450 రూపాయలు! తమఊళ్లో ఆడా, మగా, పిల్లా, మేకా కలిసి ఏడాది పొడుగునా, వొళ్లువిరుచుకున్నా పొలంపనిలో అంతగాదే! ఎంత అదృష్టం!... అదీ కాక ఎటువంటిపని! ఎంత తెలివైన పని! ఎంత శుభ్రమైన చోటు! మట్టిలేదు. బురదలేదు. ఫ్యాక్టరీ వొదిలిన మరుక్షణం చీకూ చింతా లేదు. రోజుకు ఎనిమిదిగంటలు! తమ పల్లెటూళ్ళో పనికి అంతూ పొంతూ వుందా? ఎంతచేసినా తరగదు. ఈ పట్టణంలో ఎన్ని బస్సులు, ఎన్ని ట్రాములు, ఎన్ని సినిమాలు! ఎంత బస్తీ!......

ఒక మూల ఆవరణలోనే ఒక లారీ నిలబడి వున్నది. ఆ లారీనిండా లోహపు అచ్చులున్నాయి. నలుగురు పనివాళ్ళు లారీలోకి ఎక్కి ఆ అచ్చులను కిందవున్న కూలీలకు

అందిస్తున్నారు. కిందవున్న పనివాళ్ళు వాటిని లోపలికి తీసుకుపోయి పేరుస్తున్నారు. అవి రాగిదిమ్మలు. ఎర్రగా వున్నాయి. లోపలికి చేరవెయ్యమని విఠల్‌ను నియోగించారు. ప్రతి కూలివాడూ ఒక్కొక్క చేత్తో ఒక్కొక్క దిమ్మ పట్టుకుని వగర్చుకుంటూ పోతున్నాడు. రెండు మూడుసార్లు విఠల్ కూడా రెండేసి చొప్పునే పట్టుకు పోయి నాడు, కాని ఆ దిమ్మలను రెండుచేతులకూ అడ్డంగా పెట్టేవాళ్లుంటే మూడేసికూడా మొయ్యవచ్చు ననిపించింది. ఈసారి లారీదగ్గరికి వచ్చినప్పుడు విఠల్ చేతులు రెండూ ముందుకు పెట్టి వాటిమీద దిమ్మలు పెట్టమని లారీలో నిలబడ్డ కూలీకి సూచించాడు.

“చాల్లే, గొప్ప పనివాడివి! అందుకో” అన్నాడు లారీలోవాడు.

“మూడేసి పట్టుకుపోతా” అన్నాడు విఠల్.

“అందరూ చేసినట్టు చెయ్యిఅన్నాడు లారీలోవాడు. తానే విఠల్ యజమానిలాగా, విఠల్ నిరుత్సాహ పడ్డాడు.

3

విఠల్ పనిలో ప్రవేశించి నాలుగురోజు లయింది. అప్పటికి వాడికి ఫ్యాక్టరీ కొత్త తీరింది. మనుష్యుల కొత్తా తీరింది. కాని ఫ్యాక్టరీ పనివైనం వాడి కర్థంకాలేదు. ఇది మనిషి చెయ్యగల పనేగాని మనుషులు చేసినట్లు చేసేపని కాదు. ఈ పని ఎవరో తరుముకొస్తున్నట్టుగా చెయ్యాలిసిన

పని. పాటలు పాడుతూ, మాట్లాడుతూ చేసేపనికాదు. ఇష్టమై చేస్తున్నట్టుగా చేసేపని కాదు. అందుచేతగావాలు ఈ ఫాక్టరీ కూలీలు తాము చేసిన పనిమీద ఏదో పగ వున్నట్టు చేస్తారుగాని ఆప్యాయంగా చెయ్యరు. చేసే పని గురించి మాట్లాడరు. మాట్లాడినా గునుస్తూ మాట్లాడతారు.

మిగిలిన పనివాళ్ళు మొట్టమొదటిరోజు తనను చాలా వేళాకోళం పట్టించారు. మొదటికారణం తన దుస్తులు.

"నీవు కూలీవా, ముకద్దమువా?" అని అడిగారు వాళ్ళు నవ్వుతూ. ఒక పెద్దవాడు "రేపణ్నుంచి పనిచేసేగుడ్డలు వేరే తెచ్చుకో – ఇక్కడ నిజంగా పనివుంటుంది" అన్నాడు చాలా మంచిగా. నిజానికి వాళ్ళందరూ కుళ్ళుగుడ్డలే వేసుకున్నారు. వాళ్లేకాదు, "సాబ్"లుకూడా కుళ్లుగుడ్డలే వేసుకున్నారు.

మిగిలిన పనివాళ్ళు ఏ తరగతినుంచి వచ్చిందీ విఠల్ గ్రహించలేక పోయినాడు. కాని వాళ్ళెవ్వరికీ తనకున్న హోదా ఇంటిదగర లేదేమో అనిపించింది. ఇంటిదగ్గర తనవాళ్లు గౌరవ కుటింబీకులు. కాకపోతే కొద్ది పొలంమీద చాలామంది పడి తినటంచేత కొంత అప్పయింది. తన ఉత్సాహంకొద్దీ తాను పట్నం వచ్చాడుగాని తన నెవరూ పొమ్మనలేదు. ఏరోజు తన కిష్టం లేకపోతే ఆరోజు తాని పని మానేసి ఇంటికి పోతాడు. కాని పాపం, వీళ్ళ గతేమిటి? వీళ్ళలో చాలామంది ఎన్నో ఏళ్లుగా ఈ చాకిరీ చేస్తున్నారు. ఈపని లేకపోతే వీళ్ళు వీధిలో నిలబడి అడుక్కు తినాలి.

మచ్చుకు "భయ్యా" ఉన్నాడు. వాడు వెయ్యిమైళ్ళ దూరంనుంచి వచ్చి ఇక్కడ పడ్డాడు. వాడు వేలిముద్రగాడు. చదువు రాకపోవడమేగాక వొఠ్ఠి మట్టిబుర్ర. అందరూ ఏడిపిస్తారు. బండపని వాడికి చెబుతారు. వాడికి అలుసంటే ఏంటో తెలీదు. వాడు వచ్చి ఎన్నోరోజులు కాలేదు. పనిలో చేరింది లగాయతు వాడు అర్ధణాపెట్టి టీ తాగిన పాపాన పోలేదు. ఇన్నాళ్ళూ వాడు తిండికూడ తినటం లేదుట. తన గదిలో – ఇంకా ఆరుగురుకూడా ఆ గదిలోనే ఉంటున్నారు–వాడు శనగలు నానేసుకుని అవే తింటున్నాట్ట. వెధవకు తెగులు పుట్టుకొచ్చి, మొహమంతా ఉబ్బింది. కళ్ళవెంట పుసులు కారసాగాయి.

"నీకేం బుద్ధిలేదా? శనగలుతింటే చచ్చిపోతావు. నీకు పెళ్ళామూ, పిల్లలా? సంపాదించిందంతా హాయిగా తినలేవూ? రాయంటి వొళ్ళు మట్టిచేసుకుంటావు. జాగ్రత్త" అని "చా చా" వాణ్ణి గట్టిగా కోప్పడ్డాడు.

"చా చా" పఠాన్. పేరు రహమాన్. అందరూ "చా చా" అని పిలుస్తారు. వయస్సు 62. 1914 యుద్ధంలో యుద్ధరంగాన రైఫిళ్ళు నడిపాడు. ఇప్పటికీ పుష్టిగా, బలంగా ఉన్నాడు. ఒకనాడు "చా చా" విఠల్‌కు తనకథ చెప్పాడు. యుద్ధంనుంచి తిరిగి వెళ్ళిన తరవాత "చా చా" తాను మిగుల్చుకున్న డబ్బుతో సరిహద్దున కొంతపొలం కొన్నాడు. పత్రాలూ, సాక్ష్యాలూ లేవు. అక్కడివాళ్ళకి కచేరీలలో నమ్మకం లేదల్లే ఉంది. పొలం అమ్మినవాడు ఏదో పేచీపెట్టి "చా చా"ను పొలంమీదినుంచి పంపించాలని చూశాడు.

"పొలంలోకి అడుగుపెడితే చంపుతా" అన్నాడు "చా చా". పొలం అమ్మినవాడి మనిషి వచ్చి "చా చా" చెయ్యి పట్టుకుని, "ఒకసారి అవతలికి రా. ఒక్కమాట వినిపోదూగాని" అన్నాడు.

"చెయ్యి వదులు" అన్నాడు "చా చా."

వాడు వదల్లేదు. రెండో చేతిలో ఉన్న కర్రతో "చా చా" వాడి మనికట్టుకు ఎగువగా ఒక్కటే దెబ్బ పెట్టాడు. వాడి చెయ్యి విరిగింది. "చా చా"ను మూడేళ్ళు ఖైదులో ఉంచారు.

ఖైదులోనుంచి వస్తూనే "చా చా" కొత్త ఉద్యోగం చూసుకున్నాడు—"డాకూ" ఉద్యోగం.

"డాకూ అంటే దొంగకాదు" అన్నాడు "చా చా" గర్వంగా, అదొక ఉద్యోగం. చాలా కష్టమైన ఉద్యోగం. నీ భార్యాబిడ్డల్ని నువ్వు రహస్యంగా పోయి చూడాలిసిందే గాని, వాళ్ళకు నువ్వుండే చోటు చెప్పటానికి వీల్లేదు."

"డాకూలు ఎక్కడుంటారు?"

"ఎక్కడుంటారు? ఎవరికీ తెలీకుండా ఏ కొండల్లోనో, అడవుల్లోనో ఉండాలి."

"ఎవరూ చూడరారూ?"

"రావచ్చు. కాని నాకు అంత దూరంలో నిలబడాలి

సిందే. నా సరసన నిలబడటానికి వీల్లేదు—తమ్ముడయేది తండ్రి అయేది.”

“ఏమల్లా?”

“డాకూ ఎవర్నీ నమ్మడు. డాకూను పట్టిస్తే సర్కారు డబ్బిస్తుంది. దగ్గిరవాళ్ళే కక్కుర్తి పడవచ్చు. అందుచేత, ఎదురుగా నిలబడు! అంతే! పక్కకి రాకు! భుజంమీద చెయ్యి వేశావా?—”

“చా చా” తన భుజంమీద ఎవరో వేసిన చేతిని ఒక్కసారిగా తోసేసి వాడిమీద తుపాకీబారు చేసినట్టు అభినయించాడు. ఒక్క క్షణంపాటు “చా చా” కళ్ళల్లో డాకూచూపు కనిపించినట్టే తోచింది విఠల్‌కు.

4

అవకాశం దొరికినప్పుడల్లా విఠల్ లెక్కవేస్తుండేవాడు. తాను నెలకు హీనంగా పది రూపాయలు మిగల్చవచ్చు. కొంచెం కష్టపడితే పదమూడు, పధ్నాలుగు కూడా మిగల్చవచ్చు. ఇంటిదగ్గర రెండొందలయాభై బాకీ ఉంది. మిగిలిన డబ్బంతా ఇంటికి పంపివేస్తే రెండేళ్ళలో బాకీ తీరిపోతుంది.

మొదటినెల పన్నెండు రూపాయ లింటికి పంపించినప్పుడు విఠల్ ఆనందానికి మేరలేదు. తనగురించి తన తల్లీ, అన్నలూ ఎంత సంతోషిస్తారో వాడు ఊహించుకున్నాడు. ఆ మనియార్డరుతోబాటే తానుకూడా వెళ్ళి మొహాలు

చూడాలనిపించింది. ఇల్లూ, గొడ్లూ, పొలమూ జ్ఞాపకం రాగానే కడుపులో ఏదో ఆవేదనకలిగింది. కాని అభిమానం అడ్డొచ్చింది. అప్పు తీర్చిగాని ఇంటికి తిరిగిపోరాదు. కనీసం సగం అప్పన్నా, అధమం యాభై రూపాయలన్నా చెల్లువేసి మరీ వెళ్ళాలి. ఏంలేదు. తనకు శలవెవరిస్తారు? ఒకవేళ ఇచ్చినా ఇంటికి వెళ్ళిరావాలంటే ఒకనెల మిగిల్చేదంతా ఖర్చన్నమాటే. నెలల్లాచేసిన శ్రమంతా వృధా!

రెండో నెలగడిచింది. మూడో నెలా నాలుగో నెలాకూడా గడిచాయి. యిప్పుడు విఠల్‌కు ఒంట్లోవున్న జవసత్వాలు లేవు. ఆ "చా" దుకాణంలో తినేది తనకు పడటంలేదు. ఒక్కసారి యింటితిండి తినటానికైనా వెళ్ళిరావా లనిపించింది. కాని ఎట్లా? మొదట్లో ఫాక్టరీనుంచి ఇంటికి వెళ్ళేటప్పుడే నీరసంగా ఉండేదిగాని, తెల్లవారి నిద్ర లేచిన తరవాత ఉత్సాహంగానే ఉండేది. యిప్పుడిప్పుడు వాడికి నిద్రవల్ల శరీరం బడలిక తీరటంలేదు.

"వెధవతిండి, వెధవపని, వెధవబతుకు!" అనుకునే వాడు విఠల్. తిండికన్నా, పనికన్నా ఈ బతుకే వింతగా ఉండేది వాడికి. తాను యిక్కడ ఎట్లా బతుకుతున్నదీ చెబితే యింటిదగ్గర ఎవరూ నమ్మరు. ఈ జీవితం శుద్ధ అబద్ధమనీ, ఇట్లా జీవిస్తూ తాను మారువేషం వేస్తున్నారనీ విఠల్ భావించాడు. ఆ బాకీ తీరిన మరుక్షణం తాను ఫాక్టరీకి చిన్న సలాంకొట్టి యింటికి తిరిగిపోతాడని తనతోటి

పనివాళ్ళెరగరు. తాను ఇక్కడ ఏ విధంగా జీవిస్తున్నదీ యింటిదగ్గర తనవాళ్ళకు తెలీదు.

యిప్పటికి తాను 30 రూపాయల బాకీ తీర్చేశాడు. యిక ఇంటికి పోతేనేం? ఆ బాకీ అంతా తీర్చాలని తనలో తాను శపథం చేసుకున్నాడేగాని ఎవరూ తనచేత చేయించలేదు. అదంతా తాను తీర్చెయ్యవలసిన అగత్యం కూడా లేదు. కాని ఇంటికి పోదామని నిశ్చయం చేసుకున్నప్పుడల్లా విఠల్ అంతరాత్మ "నువ్వు మనిషివికావా? అని అడిగేది.

విఠల్ ఈ సందిగ్ధంలో ఉండగా సమ్మె వచ్చింది. ఆరోజుల్లో సమ్మెలు చీటికీ మాటికీ జరగటంలేదు. యిది కార్మిక నాయకత్వంతో కూడిన అధికార సమ్మె కూడా కాదు. డిసూజా అను ఫోర్మనుకూ ఒక పనివాడికీ కొద్ది రోజులుగా ముసుగులో గుద్దులాట జరుగుతూ అది ఒకనాడు "నువ్వాంటే నువ్వా" అనుకునేదాకా వచ్చింది. ఫాక్టరీ యజమాని డిసూజా పక్షమై ఆ పనివాణ్ణి తొలగించాడు—నోటీసైనా లేకుండా. అప్పటి కప్పుడు పనివాళ్ళంతా సమ్మె నిర్ణయించారు. ఎక్కడివాళ్ళక్కడ పని వదిలేసి ఆవరణలోకి వచ్చారు. అందరూ తలా ఒక్కమాటా మాట్లాడుతున్నారు. యిద్దరేసి, ముగ్గురేసి, నలుగురేసి ముఠాలుగాచేరి, అవుననీ కాదని ఘర్షణ పడసాగారు.

ఫాక్టరీ మేనేజరు బయటికివచ్చి, "ఒక్క నిమిషంలో లోపలికివచ్చి పని చెయ్యనివాళ్ళందర్నీ బయటికి పంపించేస్తాను" అన్నాడు. కొంతమంది లోపలికి వెళ్ళారు. విఠల్

కూడా వాళ్లతోబాటు లోపలికి వెళ్ళాడు. మిగిలినవాళ్లను బయటికి పొమ్మన్నాడు.

తీరా లోపలికివచ్చినతరువాత విఠల్ ఆశ్చర్యపడ్డాడు. లోపలికి వచ్చినవాళ్ళు యిరవైమందికూడా లేరు. దాదాపు యాభైనుంచి వెళ్ళిపోయారు. అందరూ లోపలికి వస్తారనుకున్నాడు విఠల్. "సాబ్" మాటకు కూలీలు ఎదురుచెప్పటమంటూ ఉండదని విఠల్‌కు సందేహంకూడా కలగలేదు. ఈ సంగతి ముందు తెలిస్తే తానుకూడా బయటికే వెళ్లేవాణ్ణనుకున్నాడు విఠల్.

రెండు గంటలపాటు ఫాక్టరీలో ఏ పనీ లేదు. ఫాక్టరీకేదో పెద్ద సుస్తీ చేసినట్టయింది. లోపల్నుంచి బయటికీ, బయటినుంచి లోపలికీ ఏం రాయబారాలు జరిగాయో విఠల్ ఎరగడు. రెండు గంటలు దాటిన తరవాత ఫాక్టరీ బయట పెద్ద పెడబొబ్బ వినిపించింది. బయటికి పోయినవాళ్లంతా పరిగెత్తుకుంటూ లోపలికి వచ్చారు. "జీత్ గయా, సాలా!" అనే ముక్కే ప్రతి నోటా వినిపించింది. పనివాళ్ళలో అంత ఉత్సాహం విఠల్ ఎన్నడూ చూడలేదు... సమ్మె అయిపోయింది తీసిన మనిషిని మళ్లీ పనిలోకి రానిచ్చారు...

ఒక మహారాష్ట్రి పనివాడు నేరుగా విఠల్ దగ్గరకు వచ్చి ఎందుకో చెప్పకుండా మహాష్ట్రి భాషలో తిట్టిపొయ్యసాగాడు. నాకేమీ తెలియదుబాబో, అని విఠల్ ఎంత చెప్పినా వాడిధోరణి ఆగలేదు. అందరూ సమ్మెచేస్తే తాను చెయ్యనందుకు యజమాని తనకు మెచ్చి మేకతోలు

కప్పుకపోయినా, పనివాళ్ళకు చాలా కోపం తెప్పించినట్లు విఠల్ గ్రహించేడు. ఇదొక పీడగా తోచింది వాడికి. వీళ్ళంతా ఎందుకు పనిమానాలో విఠల్‌కు నిజంగా అర్థం కాలేదు. కాని పైకి ఆమాట అనలేదు. ఫ్యాక్టరీ పనిలో పనివాళ్ల జులుం ఒకటి విధిగా ఉంటుందని మాత్రం వాడు గ్రహించాడు.

యింకో రెండు నెల్లు గడిచింది. విఠల్ తల్లికి సుస్తీగా ఉందని ఉత్తరం వచ్చింది. అసలే పెద్దది. విఠల్ ఆఖరుబిడ్డ. వాడికి తల్లిని చూస్తే పంచప్రాణాలు.

"చా చా, మా అమ్మకు జబ్బుగావుంది. నేను వెళ్ళాలి. ఎట్లా?" అన్నాడు విఠల్.

"శలవు పెట్టెయ్, ఫోర్మన్‌తో చెప్పు. జీతంమట్టుకు రాదు" అన్నాడు చా చా.

"వెధవ జీవితం!" అన్నాడు విఠల్.

వాడికి వారం రోజులు శలవు దొరికింది. ఆ రోజు సాయంకాలమే స్వగ్రామానికి బయలుదేరాడు.

5

తిరిగి స్వగ్రామం కంట పడగానే విఠల్ గుండె కేదో అయింది. అంతా నిన్న చూసినట్టే ఉంది. ఒక్కరవ్వయినా మార్పులేదు. ఎంతోమంది ఎరిగినవాళ్ళు కనిపించారు. నిన్నకూడా తనను చూసినట్టే మాట్లాడారుగాని తనను

కొత్తగా చూడలేదు. "ఎల్లావుంది పట్నం?" ఈ ఒక్క ప్రశ్నే వాళ్ళు వేసింది. కొద్దిమందిమాత్రం, "ఎందుకెళ్ళావురా పట్నం?" అని అడిగారు. విఠల్‌కు ఏమీ ఉత్సాహకరంగా లేదు. ఇంటికెళ్లాడు.

నడవలో తల్లి తన రెండోకూతురి పిల్లని ఒళ్ళో పెట్టుకుని ఏదో తినిపిస్తున్నది. మనిషి మామూలుగానే ఉంది. జబ్బేమీ ఉన్నట్టు కనపడలేదు.

"అమ్మా, నీ జబ్బెట్లా ఉంది?" అని తల్లినడిగాడు విఠల్.

"ఏం జబ్బురా?... అదప్పుడే పోయింది. వచ్చావేం?" అన్నది తల్లి.

విఠల్‌కు ఏదో అర్థంగాని బాధ కలిగింది.

"వారంరోజులే శలవు తీసుకున్నా" అన్నాడు విఠల్, యింతేనా, అని తల్లి అంటుందేమోనని.

"అట్లాగా?" అన్నది తల్లి. "అట్లా అయితే నీకు కావలసినవన్నీ చేయించుకు తిను. అక్కడి తిండి ఎట్లా ఉంటుందో!"

"తిండిమాట అడక్కు! చాలా అసహ్యం," అన్నాడు విఠల్.

తల్లి కొడుకేసి జాలిగా చూసింది. కొడుక్కు కొంత ఉపశాంతి కలిగింది.

యింతలో పెద్దన్న వచ్చాడు. తమ్ముణ్ణి చూడగానే,

"అయిపోయింది నౌకరీ ?" అన్నాడు, చాలా నిరాశ కన బరుస్తూ, "నేనసలు వెళ్ళొద్దనే అన్నాను."

"శెలవు తీసుకొచ్చా. వెళ్ళితే ఏం నష్టమయిందీ ? దాదాపు యెనభై రూపాయ లప్పతీరిందా, లేదా?" అన్నాడు విఠల్. తాను డబ్బు పంపిన సంగతి వాళ్ళెవ్వరూ స్మరించే టట్టు లేరు.

"ఇట్లా తీరే అప్పా అదీ ?" అంటూ అన్న లోపలికి వెళ్ళాడు.

"ఏమిటమ్మా ?" నే పంపిన డబ్బుతో బాకీ తీర్చ లేదా ?" అన్నాడు విఠల్ తల్లితో.

తల్లి పెద్దగా నవ్వి, "తీరుద్దామనే అనుకున్నాంగాని, ఏదో ఓ ఖర్చు వచ్చింది. నువు పెద్దవాడివై సంపాదిస్తు న్నావుగా ? తీరకేంజేస్తుందిలే?" అన్నది, చాలాధైర్యంగా.

"ఒక్క రూపాయికూడా బాకీకింద చెల్లుపెట్టలేదా?" అన్నాడు విఠల్ ఆశ్చర్యంతో.

"యింకా లేదు," అన్నది తల్లి నిబ్బరంగా.

"నే పంపినదంతా ఏమయినట్టు ?" అన్నాడు విఠల్ చిరాకుతో.

"నేను పారేశానట్రా ? నువు మొదటిసారి పంపించి నప్పుడు బీ మామావాళ్ళిక్కడే ఉన్నారు. దాని కూతురు చేతులు బోతిగా బోసిగా ఉంటే, ఇంకా రెండు రూపా యలు వేసి చేతుల కేవో చేయించా. పెద్దకూతురంటే పడి

చస్తుంటారని గౌరి కూతురికూడా రెండో నెలో ఏదో చేయించా. ఆడపిల్లలకే పెడుతుంటారని ఇంట్లో పిల్లలకి అవీ ఇవీ కొన్నా. పైకం నాపేర పంపించావు కనక కాస్త నా పెద్దరికానికి తగట్టు చేశామరి. బాకీ తీర్చమని నువ్వే మన్నా రాశావా?" అన్నది తల్లి కొంచెం దెప్పుగా.

విఠల్‌కు చాలా ఆశాభంగం కలిగింది. చూస్తున్న కొద్దీ తనవాళ్ళంతా వొట్టి ఆశపాతకులుగాను, దోపిడిగాళ్ళు గానూ, ఇతరుల కష్టసుఖాలు తెలుసుకోలేని వాళ్ళుగానూ కనిపించారు. తనను ఆరునెల్ల తరవాత చూసి ఒక్క ప్రాణి అయినా నిజంగా సంతోషించలేదు. అందరూ కలిసి సంపా దించినంత తాను ఒక్కడూ సంపాదిస్తే ఒక్కరు మెచ్చుకో లేదు. తాను చమటోడ్చి, గడ్డితిని సంపాదించిన డబ్బు వెనకా ముందూ చూడకుండా అలాములు, పలాములు చేశారు.

విఠల్ తన ఫాక్టరీని జ్ఞాపకం తెచ్చుకున్నాడు. ఒక్క కూలివాణ్ణి తీసినందుకు ఫాక్టరీలోవున్న కూలీలంతా బయటికి నడిచారే! వాళ్లా మనుషులు వీళ్లా? తనమీద 'చా చా' కున్న అభిమానంలో నూరోవంతు ఇంటోవా ళ్ళందరికీ కలిపినా ఉన్నదా?

"వీళ్ళనని లాభం లేదు. ఇక్కడ జీవితమే ఇంత. నేనూ ఇటువంటివాణ్ణేగా – ఆరు నెల్ల కిందటిదాకా! ఇక్కడ ఉండి లాభం లేదు."

మర్నాడే విఠల్ పట్టణానికి ప్రయాణమైనాడు.

"అప్పుడేనా?" అన్నారందరూ. కాని వాళ్ళకు తాను నిజంగా ఉండిపోవాలని ఉన్నట్టు విఠల్‌కు తోచలేదు.

"కాదు. వెళ్లాలి! రోజుకు రూపాయిన్నర నిష్కారణంగా పోతుంది... అమ్మకు జబ్బంటే వచ్చాగాని రాకనే పోదును" అన్నాడు.

"అట్లా అయితే వెళ్ళు, పాపం!" అన్నారందరూ.

విఠల్ ఈసారి నిజమైన పారిశ్రామిక కార్మికుడుగా పట్నం ప్రవేశించాడు. పట్నం అతన్ని తన గర్భంలో దాచుకున్నది. అతని దగ్గర్నుంచి తల్లికి మళ్ళీ ఒక్క ఎర్ర ఏగానీకూడా మనియార్డరుద్వారా చేరలేదు.